
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు

5★★

గురువారం 3 ఏప్రిల్ 2025



గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మపురి, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మాజ్యోతి బాపూలే తెలంగాణ వెనుక బడిన తరగతుల సంక్షేమ పురుషుల గురుకుల డిగ్రీ కళాశాలలో గెస్టులెక్చరర్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎలగొండ రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు గణితం, కామర్స్ సబ్జెక్టులు బోధించుటకు ఎంఎస్సీ మ్యాథమెటిక్స్, ఎంకాం పీజీ 55 శాతం ఉత్తీర్ణతతో పాటు పీహెడీ, నెట్, సెట్ అర్హత కలిగిఉన్న అభ్యర్థులు కళాశాలలో ఐదో తేదీలోగా దర ఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 8019429413, 9573227028 నంబర్లలో సంప్రదిం చాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయికల్, ఏప్రిల్ 2 (ఆంధ్ర జ్యోతి): రాయికల్‌లోని 33 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల చేపడుతున్న కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/కేవీ రాయికల్ ఉప కేంద్రం, దీని పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ తుమ్మల నవీన్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర క్రీడా సాధికారత సంస్థ ఆదేశాలతో రాష్ట్రంలోని ప్రతీ జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేసవిలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు కోచ్‌ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖాధికారి రవికుమార్ తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలోని 10కేంద్రాలలో మే1 వతేదీ నుంచి మే 31వ తేదీ వరకు వివిధ క్రీడాంశాలలో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హతగల క్రీడా కోచ్‌లు ఈనెల 19వ తేదీలోగా కార్యాలయ పనివేళలో జిల్లా యువజన క్రీడాశాఖా కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

మహిళా సంఘాలకు గ్రేడింగ్..





- పాయింట్ల ఆధారంగా రుణాల్లో ప్రాధాన్యం
- పెరిగిన అధికారుల పర్యవేక్షణ
- జిల్లాలో 1,73,412 మంది మహిళా సంఘాల సభ్యులు

జగిత్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక మహిళా సంఘాలు మరింత అభివృద్ధి పథంలో పయనించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రేడింగ్ విధానం అమలు చేస్తోంది. వివిధ పథకాల్లో మహిళా సంఘాలకు ప్రాధాన్యమిస్తోంది. మహిళలకు బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించడమే కాకుండా స్వయం ఉపాధికి బాటలు వేస్తోంది. సంఘాల్లో సభ్యులు అనుభవమున్న రంగంలో రాణించేలా ప్రత్యేక రుణాలు మంజూరు చేస్తున్నారు. అందుకే మహిళా సంఘాల్లో చాలామంది సభ్యులుగా చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. బ్యాంకుతో పాటు స్త్రీ నిధి రుణాలు సైతం అందుతుండటంతో ఆర్థిక సమస్యలను అధిగ మించే దిశగా మహిళా సంఘాల సభ్యులు ముందుకు సాగుతున్నారు. ఈ సంఘాలను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో గ్రేడింగ్ విధానాన్ని సైతం అమలు చేస్తోంది. మహిళలకు గ్రేడింగ్ పెరిగే కొద్ది రుణాలకు ఎక్కువగా ఇచ్చేందుకు బ్యాంకులు ఆసక్తి చూపుతు న్నాయి. మహిళా సంఘం సభ్యులు సమావేశాలు నిర్వహించేటప్పుడు తప్పనిసరిగా ఫొటోలను జత చేయాల్సి ఉంటుంది. ఏ గ్రేడ్ నుంచి ఈ గ్రేడ్ వరకు పరిగణనలోకి తీసుకుంటారు. జిల్లాలో మొత్తం సుమారు 1,73,412మంది సభ్యులు ఉండగా గ్రేడ్‌ల ఆధారంగా రుణాలను అందిస్తున్నారు. మహిళా సం ఘాలకు ఒక్కో యూనిట్ విలువను రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నిర్ణయించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండల, గ్రామ స్థాయిల్లో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

● అంశాల వారీగా గ్రేడ్లు

మహిళా సంఘాలకు 12 అంశాల ఆధారంగా ఏ, బీ, సీ,డీ,ఈలతో గ్రేడింగ్ ఇస్తారు. ఒక్కో మహిళా సంఘం 75శాతానికి పైగా గ్రేడింగ్‌ను సాధిస్తే ఎక్కువ సంఖ్య లో రుణాలిస్తారు. ఇలా తక్కువ వడ్డీకి ఇచ్చిన రుణాలను వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. 75 శాతానికి పైగా లక్ష్యాలను సాధిస్తే ఏ గ్రేడ్, 70 శాతం నుంచి 74శాతం వరకు బీ గ్రేడ్, 60లోపు సాధిస్తే సీ గ్రేడ్ , 50శాతం వరకు ఉంటే డీ గ్రేడ్ అంతకంటే తక్కువగా ఉంటే ఈ గ్రేడింగ్ ఇస్తారు. ఏ,బీ,సీ గ్రేడింగ్ సంఘాలకు స్త్రీనిధి రుణాలను కేటాయిస్తారు. గ్రామైక్య సంఘాలకు మాత్రమే ఈ గ్రేడింగ్ విధానం అమలులో ఉంది.

జిల్లా వివరాలు ఇలా..

మొత్తం మండలాలు	20
స్వయం సహాయక మహిళా సంఘాలు	14,964
సభ్యులు...	1,73,412
గ్రామైఖ్య మహిళా సంఘాలు	565
మండల సమాఖ్య సంఘాలు	18
జిల్లా సమాఖ్య సంఘం	1

కేటాయించే విధానం

- ప్రతీనెల నిర్వహించే రెండు సమావేశాలకు సభ్యులందరూ హాజరుకావాలి.
- సక్రమంగా స్త్రీనిధి రుణ వాయిదాలు చెల్లించాలి.
- ప్రతినెల పొదుపు చెల్లింపులు ఉండాలి.
- గ్రామ సంఘానికి, బ్యాంకులకు కట్టే రుణ వాయిదాల సకాలంలో చెల్లించాలి.
- వీటన్నింటికి తగిన మార్కులను కలిపి గ్రేడింగ్ నిర్ణయిస్తారు.

మహిళా సంఘాల పర్యవేక్షణ పెరుగుతోంది..



మహిళా సంఘాల్లో గ్రేడింగ్ విధానం అమలు చేయడంతో పొదుపు సంఘాలపై పర్యవేక్షణ పెరుగుతోంది. సమావేశాలను ఏర్పాటు చేసుకున్నప్పుడు లైవ్ ఫొటోలను అప్‌లోడ్ తప్పనిసరిగా చేయాలి. ఎప్పటికప్పుడు అధికారులు సంఘాల వారీగా నివేదికలను తీసుకొని సమీక్ష చేస్తున్నారు.

-రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి

● అదనపు కలెక్టర్ బీఎస్ లత



సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ లత, అధికారులు

జగిత్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ కోటపై బహుజన జెండా ఎగరవేసిన గెరిల్లా పోరాట యోదుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గోల్కొండ సింహాసనాన్ని అధిష్టించిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్, నాయకులు బండ శంకర్, రాజుకుమార్, సాయాగౌడ్, మెప్మా జిల్లా పరిపాలన అధికారి దుర్గపు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెలాఖరు వరకు 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్ కుమార్ బుధవారం పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడ దన్నారు. వివిధ కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవా లన్నారు. పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు

● కోరుట్ల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్



దుకాణదారుడికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ దుకాణం యజమానులను హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు దుకాణాల్లో దాడులు నిర్వహించి ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణదారులకు రూ.11,000 జరిమానాలను విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ మాట్లాడుతూ సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను ప్రభుత్వ పూర్తిగా నిషేధించిందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలే అశోక్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేష్, వార్డు అధికారులు అనిల్, హేమంత్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణదారులు నిబంధనలు పాటించాలి

● జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్



బండలింగాపూర్ ఫర్టిలైజర్ షాపులోని రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్స్ దుకాణదారులు నిబంధనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ సూచించారు. బుధవారం మండలం లోని బండలింగాపూర్ గ్రామంలోని ఫర్టిలైజర్, ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయా ధికారి దీపికతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని రిజిష్టర్స్, బిల్ బుక్స్ లైసెన్స్‌లతో పాటు యూరియాను, స్టాక్ రికార్డులను పరిశీలించారు.

ఈపాస్, పీవోఎస్ మిషన్‌ద్వారా యూరియా రైతులకు అందజే యాలన్నారు. అధిక ధరలకు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రైతులకు సరిపడా యూరియా, విత్తనాలు అందుబాటులో ఉంచుకుని, ఎమ్మార్పీ ధరలకు అందజేయాలని సూచించారు. స్టాక్ వివరాలను ఎప్పటి కప్పుడు రికార్డులో నమోదు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ఫర్టిలైజర్స్ దుకాణదారులు, పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మల్యాల మండలం నూకపల్లిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రులు, అధికారులు ఏ బియ్యం తింటారో అవే బియ్యం పేదలకు అందించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని నూకపల్లిలో బుధవారం అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలసి ఎమ్మెల్యే రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని మోదీ స్వరాష్ట్రం లోనూ పేదలకు సన్నబియ్యం ఇవ్వడం లేదని విమర్శించారు. పదేళ్లు పరిపాలించిన మాజీ సీఎం కేసీఆర్‌కు సన్న బియ్యం అందించాలనే ఆలోచనే రాలేదన్నారు. రూపాయి ఖర్చు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సన్నబియ్యం, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయా ణం, ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించిం దని తెలిపారు. అనంతరం 36మందికి రూ.10.96లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. 100మంది యువకులకు హెల్మెట్లను సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్ కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. మద్దుట్లలో నూతన బోర్‌వెల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్‌సప్లయిస్ అధికారి మనోజ్, ఆర్డీవో మధుసూదన్‌రావు, ఏఎంసీ ఛైర్మన్ బత్తిని మల్లేశ్వరి, తహసీల్దార్ మునీందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొండగట్టులో హనుమాన్ చిన్న జయంతి ఏర్పాట్లు 7

ఈజీఎస్ కూలీలకు రోజు వేతనం రూ.400 చెల్లించాలి 8

● మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

వెల్గటూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ రాంనర్సింహారెడ్డి పేర్కొన్నారు. వెల్గటూరు మండలంలోని కిషన్‌రావుపేట శివారులోని నాగవల్లి శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ నైనాల అజయ్ మరియు కమిటీ సభ్యుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దేవాలయాలు, మసీదులు, చర్చిలలో, గ్రామ కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. దీంతో అవాంఛనీయ ఘర్షణలు నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో వెల్గటూర్ ఎస్సై ఆర్.ఉమ సాగర్, వీపీవో ఆదిల్, నాయకులు కుమ్మరి వెంకటేష్, తరాల శివ కుమార్, పాదం సురేష్, కాలువ తిరుపతి పాల్గొన్నారు.

గుమ్లాపూర్ గ్రామాన్ని సందర్శించి కేంద్ర బృందం



వర్మీ కంపోస్టు షెడ్డును పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండలంలోని గుమ్లాపూర్ గ్రామాన్ని బుధవారం కేంద్ర, రాష్ట్ర పరిశీలన బృందాలు సందర్శించాయి. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్‌ను కేంద్ర, రాష్ట్ర బృందం పరిశీలించాయి. కేంద్ర బృందం సభ్యులు డిప్యూటీ సెక్రెటరీ కే. శ్రీనివాస్, సెక్షన్ అఫీసర్ నితిన్ వర్మ, కన్సల్టెంట్, ఎస్‌బీఎం స్టేట్ డైరెక్టర్ సురేష్‌లు గ్రామంలోని ఇంకుడు గుంతల నిర్మాణం, తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై ఆరా తీశారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానంలో వచ్చే రాబడి గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో నిర్మాణం చేసిన టాయిలెట్ రూంలను పరిశీలించారు. కేంద్ర తాగు నీరు పారిశుధ్య మంత్రిత్వ శాఖ అధికారుల పరిశీలన బృందం స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ అభివృద్ధి పనులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ తరపున రాష్ట్ర స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ సురేష్‌బాబు గ్రామాన్ని పరిశీలించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంకుడు గుంతలు, పారిశుధ్య పనులను పరిశీలించి గ్రామ పంచాయతీ సిబ్బంది వివరాలను నమోదు చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నితన్‌వర్మ, కన్సల్టెంట్ జైపాల్ దక్స్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, ఎస్‌బీఎం కన్సల్టెంగ్ హరిణి, చిరంజీవి, ఐకేపీ ఏపీఎం శంకర్ పాల్గొన్నారు.

ఈఎంటీల సేవలు అభినందనీయం

జిల్లా వైద్యాధికారి ప్రమోద్



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ప్రమోద్

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎమర్జెన్సీ టెక్నీషియన్ల సేవలు అభినందనీయమని జగిత్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ అన్నారు. జతీయ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మాత శిశు కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 108లో పనిచేసే సిబ్బంది అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని శలువాతో సత్కరించారు. రోడ్డుపై గాయ పడిన క్షతగాత్రులను, డెలివరీకి సిద్ధంగా ఉన్న గర్భిణులను అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు తరలించడంలో ఈఎంటీలు ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. పాముకాటుకు గురైన, గుండెనొప్పి వచ్చిన బాధితులకు ఆపత్కాలంలో ఆసుపత్రికి తరలించి ఆపద్బాంధవులుగా నిలుస్తారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, 108 జిల్లా కో ఆర్డినేటర్ రాము, ప్రధానా సుపత్రి ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ కుమారస్వామి, తరాల శంకర్ ఉన్నారు.

ఇంటర్‌లో నూతన కోర్సులు ప్రవేశపెట్టాలి

జగిత్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ఆర్ట్స్ విభాగంలో హెచ్‌సీఈసీ కోర్సు ప్రవేశపెట్టాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి బొప్పరాతి నారాయణకు చరిత్ర పరిరక్షణ సమితి నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా సాంప్రదాయ ఆర్ట్స్ కోర్సులైన హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులను కలిపి హెచ్‌సీఈసీ (చరిత్ర, కామర్స్, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం)తో నూతన కోర్సు రూపకల్పన చేసి ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చరిత్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు తిరపతి, చరిత్ర జూనియర్ లెక్చరర్లు సుదర్శన్, నరేశ్, రామ్ ప్రసాద్, దేవేందర్ పాల్గొన్నారు.

బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి

జగిత్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని జగిత్యాల మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన బీసీ గర్జనలో పలువురు నేతలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా స్థానిక విలేకరులతో సెల్‌ఫోన్ ద్వారా ఆమె మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి, తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

ఘనంగా నాగులమ్మ జాతర



ఉత్సవ విగ్రహాల శోభయాత్రలో పాల్గొన్న మహిళలు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండలంలోని నాగులపేట గ్రామం లోని నాగులమ్మ దేవాలయంలో జాతర మహోత్సవం ఘనంగా సాగింది. బుధవారం దేవాల యంలో వేదపండితులు బ్రహ్మణగారి శంకర్ శర్మ, కిషన్ శర్మల మంత్రోచ్ఛరణ మధ్య సాగింది. దేవాలయంలో అర్చన, అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. రాజరాజేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామస్థుల ఆధ్వర్యంలో బాజా భజంత్రీలతో శోభాయాత్ర జరిపారు. ఉత్సవ మూర్తులకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ప్రత్యేక వేదికపై రాజరాజేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు పూజలను నిర్వహించి కల్యాణం జరిపారు. దేవాలయ ఆవరణలో ఉన్న పుట్టకు మహిళలు పాలు పోసి పంటలు బాగా పండి ప్రజలు ఆరోగ్యాలు బాగుండాలని పూజలను నిర్వహించారు.

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులు వేర్వేరుగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కృష్ణారావు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమంను నిర్వహించంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాస్కర్ రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ నర్సరెడ్డి, రైతు సమన్వయ కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావులతో పాటు బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య


మధు (ఫైల్)

ఇల్లందకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన వంగ మధు(28) అనే కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధు చిన్న వయస్సులోనే తల్లి చనిపోగా, తండ్రి ఐదేళ్ల క్రితం మృతిచెందాడు. మధు గ్రామంలో మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంటను సాగుచేశాడు. ఈ క్రమంలో మొక్కజొన్న లాభసాటిగా దిగు బడి రాకపోగా, సుమారు రూ. 1.50లక్షల వరకు నష్టం వచ్చింది. దీంతో మనస్థాపం చెందిన మధు ఆదివారం ఇల్లందకుంట శివారులోని ఎర్ర గుట్టల సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు.

బావిలో పడి రైతు మృతి


దేవయ్య (ఫైల్)

గంభీరావుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతిచెందాడు. చివరి దశలో ఎండుతున్న పంటను కాపాడుకోవటానికి ఓ రైతు తన బావిలో పూడికతీత పనులు మొదలు పెట్టాడు. పనులను చూసేందుకు తాడు సహాయంతో బావిలోకి దిగుతుండగా రైతు ప్రమాదవశాత్తు జారిపడటంతో మృతిచెందాడు.ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. శివంది దేవయ్య (45) తనకున్న 3 ఎకరాల పొలంలో వరి పంట వేశాడు. తన వ్యవసాయ బావిలో నీరు ఇంకిపోతుండటంతో మూడు రోజుల క్రితం క్రేన్‌తో పూడికతీత పనులు మొదలు పెట్టాడు. తాడు సహాయంతో రైతు దేవయ్య బుధవారం బావిలోకి దిగుతున్న క్రమంలో జారిపడ్డాడు. తీవ్రగాయాల పాలైన దేవయ్యను ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే రైతు దేవయ్య మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి


సరోజన(ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న చందుర్తి మండలకేంద్రానికి చెందిన చింతపల్లి సరోజన(78)అనే వృద్ధురాలు బుధవారం మృతిచెందింది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. సరోజన గత మార్చి 31న తన కుమారుడైన వెంకటేశ్వర్‌రావుతో ద్విచక్రవాహనంపై చందుర్తి నుంచి వేములవాడకు వెళ్తుండగా మండలకేంద్రం శివారులో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సరోజన తలకు బలమైన దెబ్బ తగలడంతో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై మృతురాలి బంధువు కారంగుల మధుసూదన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. మృతిరాలికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

ధర్మపురి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామ సమీపంలో కారు ఢీకొని అదే గ్రామానికి చెందిన లెక్కల లింగన్న (65) అనే వృద్ధుడు బుధవారం మృతిచెందాడు. లింగన్న నేరెళ్ల వద్ద బీటు వద్ద పనులు ముగించుకొని నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా జగిత్యాల వైపు నుంచి ధర్మపురి వెళ్తున్న కారు టీఎస్ 10ఈఈ 8668 డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడిపినవ్యక్తి హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన రాపర్తి వెంకటేష్‌గా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ


ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న పగిడిమర్రి సోలోమన్

భగత్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీజోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌గా పగిడిమర్రి సోలోమన్ బుధవారం బస్టాండ్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ బి.రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు బీవీ రావు, భూపతిరెడ్డి, డిప్యూటీ పర్సనల్‌మేనేజర్ విలాస్‌రెడ్డి, జోనల్ పర్సనల్ మేనేజర్ విలాస్ రెడ్డి, సుగుణాకర్, సీనియర్ మెడికల్‌ఆఫీసర్ గిరిసింహారావు శుభకాంక్షలు తెలిపారు.

● కరీంనగర్ జోన్ ఈడీగా పనిచేసి హైదరాబాద్ బదిలీపై వెళ్తున్న ఖుస్రోషాఖాన్‌కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఈడీ సోలోమన్‌కు టీజీఎస్‌ఆర్టీసీ ఎస్సీఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు.

పొద్దు తిరుగుడు కొనేదెన్నడు?



● కొనుగోలు కేంద్రాలు లేక రైతుల ఇబ్బందులు
● దళారీల బారినపడి నష్టపోతున్న వైనం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో పొద్దుతిరుగుడు రైతులు దళారీల బారినపడి తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని ముస్కానిపేట, కేసన్నపల్లె, గాలిపెల్లి, తాళ్లపెల్లి, పత్తికుంటపల్లె తదితర గ్రామాల్లో దాదాపు 1200 ఎకరాలలో రైతులు పొద్దుతిరుగుడు పంటను ఈ సంవత్సరం సాగుచేశారు. విత్తనాల ధరకు తోడు కూలీల ధరలు పెరగడంతో గతంలో కంటే పొద్దుతిరుగుడు సాగుచేయడానికి పెద్దమొత్తంలో రైతులు వెచ్చించారు. పంటచేతికి అందివచ్చే దశలో బావులు, బోర్లలో నీరు తగ్గడంతో నానా ఇబ్బందులు పడి పంటను కాపాడుకున్నారు. పొద్దుతిరుగుడు పంటను కోసి నెల రోజులు కావస్తోంది. పొదుతిరుగుడు పంటను అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రం లేదు. సిద్దిపేట, బెజ్జంకిలో మాత్రమే ఉండడంతో అక్కడికి అమ్ముదామనుకుంటే ఈప్రాంత రైతుల పంటను కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటాలుకు రూ.7280 చెల్లిస్తుండగా దళారులు రూ.5500కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాకు చెందిన కొంతమంది దళారులు ఇక్కడ రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కష్టపడి పండించిన పంటను కొంతమంది రైతులు తక్కువ ధరకు అమ్మలేక, వ్యవసాయ బావుల వద్ద కల్లాల్లోనే ఉంచుకుంటున్నారు. వర్షాలు పడితే ఎక్కడ పంట తడుస్తుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది..

బట్టు సుధాకర్, రైతు గాలిపెల్లి



పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. భూగర్భజలాలు తగ్గడంతో కొంతమేర ఎండిపోయింది. సిద్దిపేట, బెజ్జంకి కొనుగోలు కేంద్రాలకు తీసుకొని పోయినా పట్టాదారు పాసుపుస్తకాలు చూసి తమ ప్రాంతానివి కావని తిప్పి పంపుతున్నారు. ఆరు ఎకరాలలో పంటను సాగుచేశాను. పంటను కోసి నెల రోజులు అవుతోంది. ప్రభుత్వం వెం టనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

త్వరలో సమస్య పరిష్కారం..

సురేష్‌రెడ్డి, ఇల్లంతకుంట వ్యవసాయాధికారి



పొద్దుతిరుగుడు రైతుల సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకపోయాం. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం. కొనుగోలు కేంద్రం ఏర్పాటు కాకపోతే టోకెన్లు జారీచేస్తాం. రైతులు తొందరపడి దళారులకు అమ్మి నష్టపోవద్దు. పంటను కల్లాల వద్ద జాగ్రత్తగా కాపాడాలి.



మోటార్ సైకిల్‌ను ఢీకొన్న రెండు కార్లు

● ఇద్దరికి తీవ్రగాయాలు


రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విఠల్, అవినాష్

మానకొండూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామశివారులో మోటార్‌సైకిల్‌ను రెండుకార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కెల్లేడు గ్రామానికి చెందిన విఠల్ (18), అవినాష్ (18) అనే ఇంటర్ విద్యార్థులు మోటార్ సైకిల్‌లో పెట్రోల్ పోసుకునేందుకు బంక్‌కు వచ్చి తిరిగివెల్లుతున్నారు. జమ్మికుంట నుంచి కరీంనగర్ వైపు వెల్లుతున్న కారు మోటార్ సైకిల్‌ను ఢీకొంది. అదే సమయంలో కరీంనగర్ నుంచి పచ్చునూర్ వైపు వెల్లుతున్న మరో కారు అదే మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పందుల చోరీ

సుల్తానాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని రైస్ మిల్లులప్రాంతంలో కొందరు గుర్తు తెలియని దొంగలు మందలో ఉన్న పందులను ఎత్తుకెళ్లారు. మానుపాటి ఈదయ్యకు చెందిన 32 పందులను ఒక చోట మందగా ఏర్పాటుచేసి అందులో ఉంచగా బుధవారం ఉదయంలేచి చూసేసరికి మందలో పందులు మాయంఅయ్యాయి. దాంతో బాధితులు వెంటనేపోలీసులను ఆశ్రయించారు. సమీపంలోని రైస్‌మిల్లు అసోషి యోషన్ కార్యాలయంలోఉన్న సీసీ కెమెరాల పుటేజీ పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు ఒకబైక్‌పై ముందు వెళ్తుండగా మరోట్రాలీలో పందులను తీసుకువెళ్తున్నట్లు కనిపించింది. దాదాపు 2లక్షల రూపాయల విలువ ఉంటాయని బాధితులు తెలిపారు.

అనుమతి లేకుండా రోడ్డుపై వార్షికోత్సవం

● పాఠశాలపై కేసు నమోదు

ముస్తాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీవాణి ప్రైవేట్ పాఠశాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గణేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల వార్షికోత్సవం మంగళవారం సాయంత్రం ఎలాంటి అనుమతి లేకుండా రోడ్డుపై నిర్వహించడంతో వాహనదారులకు ఇబ్బందులు కలిగించారని పాఠశాల యాజమాన్యంతోపాటు, ఆర్గనైజర్‌పై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెలిచాల గ్రామాన్ని సందర్శించిన కేంద్ర బృందం


వెలిచాల గ్రామ పంచాయతీ ఆవరణలో కేంద్ర బృందం

రామడుగు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచాల గ్రామాన్ని కేంద్ర తాగునీరు, పారిశుధ్య ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. స్వచ్ఛభారత్ మిషన్ ఓడీఎఫ్ ప్లస్ మోడల్ గ్రామంగా ప్రకటించుకొని గ్రామంలోని పారిశుధ్య వసతులను, వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, మురికినీటి నిర్వహణ, డ్రైనేజీ గుంత వాడకం, తదితర అంశాల సుస్థిరతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బృందంలో డిప్యూటీ సెక్రెటరీ శ్రీనివాస్, కన్సల్టెంట్ జైపాల్ దక్ష, స్వచ్ఛ భారత్ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ సురేష్ బాబు ఉన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీధర్, మండల ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాశ్ కిరణ్, ఎంపీడీవో రాజేశ్వరి, పంచాయతీ అధికారి శ్రవణ్, గ్రామప్రత్యేక అధికారి, ఏపీవో రాధ, ఏపీఎం ప్రభాకర్, జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్లు రమేష్, వేణు, యూనిసెఫ్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కిషన్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు


గాయపడ్డ తిరుపతి

ధర్మారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామయ్యపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గ్రామానికి చెందిన పల్లె తిరుపతి వృత్తిరీత్యా బుధవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారి కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. తిరుపతి పరిస్థితి విషమించడంతో అతన్ని స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

అజాగ్రత్తగా బైక్ నడిపిన బాలుడిపై కేసు

చందుర్తి, ఏప్రిల్ 2, (ఆంధ్ర జ్యోతి): అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడిపి ఆటోను ఢీకొట్టిన సంఘటనలో బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన మల్యాల జాషువా(17) అనేబాలుడు ద్విచక్ర వాహనంపై బండపల్లి నుంచి వేములవాడ వైపు వెళుతుండగా, వేములవాడ నుంచి బావుసాయిపేట వైపు వస్తున్న ఆటోను ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి జంగం జాన్‌కు గాయాలయ్యాయి. జంగం ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జాషువాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫ్లెక్సీల ధ్వంసంపై కేసు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడం, దహనం చేయడంపై యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్ ఫాహద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. బుధవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా ఇన్‌చార్జి అబ్దుల్ అమీర్ డీసీసీ కార్యాలయంలో సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. ఈ క్రమంలో జిల్లా నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. గుర్తుతెలియని వ్యక్తులు యువజన కాంగ్రెస్ నాయకుడు ఫాహద్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించి వేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి అజీం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తగలబెట్టారు. కొందరు కాంగ్రెస్ నాయకులే తమ ఫ్లెక్సీలను ధ్వంసం చేసినట్లు అనుమానంగా ఉందని ఫాహద్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

మెట్‌పల్లి పట్టణంలో చోరీ

● 13 తులాల బంగారం, 20 తులాల వెండి అపహరణ

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిపట్టణంలోని సాయిరాంనగర్ కాలనీలో బుధవారం దొంగలు ఓ ఇంటి తాళం పగులగొట్టి 13 తులాల బంగారం, 20తులాల వెండి ఎత్తుకెళ్లారు. మెట్‌పల్లి ఎస్‌ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సాయిరాంనగర్ కాలనీకి చెందిన ఎల్దాస్ శ్యామల అనే ఉద్యోగి తన బంధువుల దగ్గరికివెళ్లి తిరిగి బుధవారం సాయంత్రం ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 13 తులాల బంగారం, 20తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ అనిల్ కుమార్‌లు పరిశీలించి క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఖననం చేసిన చిన్నారి మృతదేహం వెలికితీత

● మేజిస్ట్రేట్ సమక్షంలో పోస్టుమార్టం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పసికందు మృతికి రెండు ప్రైవేటు హాస్పిటల్స్ కారణమని తల్లిదండ్రుల ఫిర్యాదు చేయడంతో ఖననం చేసిన మృతదేహాన్ని పోలీసులు బుధవారం వెలికితీశారు. వివరాల్లోకి వెళితే.. ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన గండి గీతాంజలికి గతనెల 18వ తేదీన కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మగబిడ్డ జన్మించాడు. పుట్టిన తర్వాత శిశువు ఆరోగ్యం నిలకడగా లేకపోవడంతో కరీంనగర్‌లోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికి పరిస్థితిలో మార్పు రాకపోవడంతో హైదరాబాద్‌కు తరలించారు. తరలించిన గంటల వ్యవధిలో పసికందు మృతిచెందాడు. మృతదేహాన్ని ఫాజుల్‌నగర్ గ్రామంలో పూడ్చారు. అయితే తమ కొడుకు మృతికి కరీంనగర్‌లోని రెండు ప్రైవేటు ఆసుపత్రులే కారణమని రాజశేఖర్-గీతాంజలి దంపతులు కరీంనగర్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్సైలు దీపక్, చంద్రశేఖర్‌లు చిన్నారిని పూడ్చిపెట్టిన ఫాజుల్‌నగర్ గ్రామానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ఖననం చేసిన చిన్నారి మృతదేహాన్ని మండల మెజిస్ట్రేట్ అబుబాకర్ సమక్షంలో వెలికితీసి ఏరియా ఆసుపత్రి వైద్యులు ప్రణతిరెడ్డి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

కారు ఢీకొని ముగ్గురు విద్యార్థులకు గాయాలు

ధర్మపురి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో బుధవానం కారు ఢీకొని కుర్మదాస్, వినయ్, ప్రేమ్‌దాస్ అనే ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. గునిశెట్టి సంతోష్ అనే వ్యక్తి జూనియర్ కళాశాల మైదానంలో సాయంత్రం కారు నేర్చుకుంటున్నాడు. అదే సమయంలో జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ పురుషుల డిగ్రీకళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వాకింగ్ చేస్తున్నారు. సంతోష్ నడుపుతున్న కారు అదుపు తప్పి ముగ్గురు విద్యార్థులను ఢీకొట్టడంతో ఆసిఫాబాద్‌కు చెందిన కుర్మదాస్ అనే విద్యార్థికి రెండు కాళ్లు ఫ్రాక్చర్ అయ్యాయి. మరో ఇద్దరు విద్యార్థులకు స్వల్పంగా గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను వెంటనే చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. వైస్‌ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

కిష్టంపల్లిలో ప్రభుత్వభూమి కబ్జాకు యత్నం

● కాపాడేందుకు విగ్రహాల ప్రతిష్ఠ


కిష్టంపల్లిలో ఏర్పాటు చేసిన విగ్రహాలు

రామడుగు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలోని వెంకట్రావుపల్లె పరిధిలోని కిష్టంపల్లిలో ఓవ్యక్తి ప్రభుత్వభూమి కబ్జా చేసేందుకు యత్నించగా గ్రామస్థులందరు కలిసి దేవతా మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. గ్రామస్తులకథనం ప్రకారం.. గ్రామం లోని 674సర్వే నంబర్‌లో తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమిఉంది. ఈభూమిని లక్ష్మీ పూర్ పంపుహౌజ్ నిర్మాణం జరిగిన సమ యంలో మెగా కంపెనీ ఈ భూమిలో మట్టిని పోసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి పొందింది. అయితే ఈ భూమి తనకు సంబంధించినదని ఓవ్యక్తి చదును చేస్తున్న సమయంలో గ్రామస్థులు ఆయనను అడ్డుకున్నారు. ఈ ఘటనలో స్థానిక సదరువ్యక్తి ఫిర్యాదు చేయడంతో 42మందిపై కేసులు నమోదయ్యాయి. ఈ ఘటన ఇలా ఉండగా నాలుగురోజుల క్రితం మళ్లీ భూమిని కైవసం చేసుకోవడానికి ప్రయత్నించడంతో గ్రామస్థులంతా కలిసి అదే స్థలంలో శివలింగం నంది విగ్రహాలను నెలకొల్పారు. దీంతోగ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో సమస్య పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది.

దీంతో రూరల్ ఏసీపీ కరుణాకర్ గ్రామానికి వచ్చి పరిశీలించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. కాగా భూమి సదరు వ్యక్తికి సంబంధించిందాలేదా ప్రభుత్వానిదా అనేది తేలాల్సి ఉంది.

హత్య కేసులో నిందితుల రిమాండ్

● పది నెలల తర్వాత గుర్తింపు


మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదినెలల క్రితం బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు వద్ద జరిగిన అంకం లక్ష్మీనారాయణ(55) అనే వ్యక్తి హత్యకేసులో నిందితులను బుధవారం గుర్తించి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను జగిత్యాలలో బుధవారం డీఎస్పీ రఘుచందర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం జూన్ 14న బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు వద్ద ఒక గుర్తు తెలియనివ్యక్తిని పెట్రోల్‌పోసి కాల్చి చంపారని అప్పటి కార్యదర్శి పుర్రె చిన్న నర్సయ్య బీర్‌పూర్ పోలీస్ సేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతుడి భార్య అంకం అరుణ, చిన్నకుమారుడు అంకం సాయికుమార్‌లకు లక్ష్మీనారాయణ మృతదేహం చూపించారు. వారు ఆ మృతదేహం తమ వారిది కాదని వదిలేసి వెళ్లారు. ఆ తరువాత మృతుడి యొక్క ఎముక భాగాలను డీఎన్ఏ పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. చనిపోయిన వ్యక్తి నర్సింహలపల్లికి చెందిన అంకం లక్ష్మీనారాయణగా గుర్తించి విషయాన్ని భార్య, కుమారుడికి తెలియజేయగా వారిలో ఎలాంటి స్పందన కనిపించలేదు. దీంతో మృతుడిభార్య అరుణ, కుమారుడు సాయికుమార్ మీద అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించగా మొదట్లో నేరాన్ని అంగీకరించలేదు. దీంతో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం పాలిగ్రాఫ్(లైడిటెక్టర్) టెస్ట్‌కు మృతుడి కుమారుడు, భార్యను పంపించామని డీఎస్పీతెలిపారు. దాంట్లో అంకం లక్ష్మీనారాయణను హత్యచేసింది వారేనని నిర్ధారించుకొని నిందితులను అదుపులోనికి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేసిన జగిత్యాల రూరల్ సీఐకృష్ణారెడ్డిని డీఎస్పీ అభినందించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కేసులో కోర్టుకు మంత్రి శ్రీధర్‌బాబు


నాంపల్లి కోర్టు విచారణకు హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంప్రాజెక్టులో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేసినందుకు అప్పటి బీఆర్ఎస్‌ప్రభుత్వం నమోదు చేసిన కేసులో మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. 2017లో బసంత్‌నగర్ పోలీసులు మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు హర్కాల వేణుగోపాల్, అన్నయ్యగౌడ్, శశిభూషణ్‌కాచేతోపాటు మరో 9 మందిపై కేసులు నమోదుచేశారు. విచారణలో భాగంగా వారు కోర్టుకు హాజరయ్యారు. శాంతియుతంగా ఆందోళన చేసినా అప్పటి ప్రభుత్వం తమపై ఐపీసీ 147, 353, 427 రెడ్‌విత్149 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వారు వాపోయారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో యూనివర్సిటీల భూములు కబ్జా



ఎస్‌యూలో బంద్ పాటించి నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యూనివర్సిటీల భూములు కబ్జాకు గురవుతున్నాయని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ ఆరోపించారు. హెచ్‌సీయూ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ బంద్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులు ప్రజలు ప్రశాంతంగా జీవించలేకపోతున్నారన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే బయోడైవర్సిటీ యూనివర్సిటీ 100 ఎకరాలను హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పుడు విద్యార్థులు నిరసన వ్యక్తం చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం 400 ఎకరాల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూమిని వెంచర్లు చేసి సొమ్ము చేసుకోవాలని చూస్తోందన్నారు. ఇక్కడ ఎన్నో రకాల పక్షులు, జంతువులు జీవిస్తున్నాయని, వాటి ప్రాణాలు తీసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూలో భూముల కోసం విద్యార్థులు ధర్నా చేస్తుంటే లాఠీచార్జి సిగ్గుమాలిన చర్యన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మాలని చూస్తున్న భూములను వెంటనే యూనివర్సిటీ కేటాయించాలని, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసులను ఎత్తివేయాలని, లేని పక్షంలో సెక్రెటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యులు కిరణ్మయి, జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, యూనివర్సిటీ అధ్యక్షులు బాలకృష్ణ, కార్యకర్తలు సాయి, అనూష, గౌరీ, ప్రియ, మానస తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేటలో కేంద్ర బృందం పర్యటన



కేంద్ర బృందాన్ని ఆహ్వానిస్తున్న అధికారులు

కోనరావుపేట ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో జలశక్తి స్వచ్ఛభారత్ మిషన్ కేంద్ర బృందం అధికారులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతలు, కంపోస్ట్ షెడ్‌లను మర్తన్‌పేట ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్యం, తాగునీటి వంటి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం డిప్యూటీ సెక్రెటరీ శ్రీనివాస్ సెక్షన్ ఆఫీసర్ నితిన్‌తో పాటు సెంట్రల్ టీం వర్మ జైపాల్ సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

పెన్షనర్లకు నష్టం చేసే బిల్లును ఉపసంహరించాలి

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు నష్టం చేసే బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలని టీ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన చర్చా వేదికలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్లను పదవీ విరమణ తేదీ ఆధారంగా విడదీయడం అసమంజసమని ఇచ్చిన సుప్రీం కోర్టు తీర్పును గుర్తు చేశారు. ఈ సవరణ బిల్లు సుప్రీం తీర్పును నిర్వీర్యం చేసేలా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ పీసీ హన్మంత్, బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాశ్‌రావు, ఎండీ యాకుబ్, పూసల అశోక్‌రావు, డిండిగాల విఠల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రిబ్బన్‌కు ఓ ప్రత్యేకత



మీకు తెలుసా..

ఒక్కో సందర్భానికి ఒక్కో రంగు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏదైనా నిరసనలు జరుగుతున్నప్పుడు అందులో పాల్గొన్న వారు నల్ల రంగు రిబ్బన్లు ధరిస్తారు. మహిళల ఆరోగ్యం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తే గులాబీ రంగు రిబ్బన్లు ధరిస్తారు.. సందేహాలకు, సంతాపాలకు, నిరసనలకు, అవగాహనకు ఒక్కో సందర్భానికి ఒక్కో రిబ్బన్ వాడుతుంటారు. కొన్ని రకాల వ్యాధులు, వాటి పేరుకంటే కూడా రిబ్బన్ సింబల్ నే పాపులర్ అయ్యాయి. ఆ సింబల్ చూడగానే వ్యాధిపై అవగాహనకు వచ్చేస్తాం. రిబ్బన్లతో రకరకాల రంగులు నలుపు, తెలుపు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపు ఇలా ఒక్కో రంగు ఒక్కో అంశాన్ని తెలియజేస్తుంది. ఈ నేపథ్యంలో ఏ రంగు రిబ్బను ఏం అంశాన్ని సూచిస్తుందో తెలుసుకుందాం.

18 రకాల రిబ్బన్లు

మానవ శరీరంలో వివిధ అవయవాలకు సోకిన క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలకు వైద్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు 18 రకాల రిబ్బన్లను ఉపయోగిస్తారు. క్యాన్సర్ వ్యాధి సోకడానికి కారణాలు, వాటి లక్షణాలు, ట్రీట్మెంట్ విధానం ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు వీటిని ధరిస్తారు.



నల్ల రంగు..

తమ డిమాండ్లను తెలియజేస్తూ నిరసన వ్యక్తం చేసినప్పుడు నలుపు రంగు రిబ్బన్ ధరిస్తారు. మృతిచెందిన వారికి సంతాప సూచకంగా నివాళి అర్పించే సమయంలోనూ వీటిని ధరిస్తారు.

ఎరుపు రంగు

ఎయిడ్స్, బ్లడ్ క్యాన్సర్, గుండె జబ్బులు, వ్యసనాలు, విపత్తుల సందర్భంగా నిర్వహించే సమావేశాల్లో ఎరుపు రంగు రిబ్బన్‌ను ధరిస్తారు. అత్యవసర పరిస్థితులకూ దీనిని ఉపయోగిస్తారు.

నీలం రంగు

నీలం రంగు రిబ్బన్‌ను 100కు పైగా సందర్భాల్లో ఉపయోగిస్తారు. ప్రధానంగా మానవ అక్రమరవాణా, బెదిరింపులకు వ్యతిరేకంగా వీటిని ఉపయోగిస్తారు. జల సంరక్షణపై అవగాహన కల్పించే సమయంలోనూ నీలం రంగు రిబ్బన్‌ను వాడతారు.

తెల్ల రంగు

గర్భిణులు,మహిళలపై దాడులు జరిగినప్పుడు వాటికి వ్యతిరేకంగా నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో తెల్ల రంగు రిబ్బన్ ధరిస్తారు. సురక్షిత మాతృత్వం, శాంతి, అహింసలను తెలుపుతూ జరిగే కార్యక్రమాల్లో వీటిని ఉపయోగిస్తారు.

ఆకుపచ్చ రంగు

మూత్రపిండాలు, కాలేయం, అవయవ దానం, సురక్షిత డ్రైవింగ్ పై అవగాహన కల్పించేందుకు ఆకు పచ్చ రంగు రిబ్బన్‌ను ఉపయోగిస్తారు. గ్లోబల్ వార్మింగ్‌పై సమావేశాల్లో ఈ రంగు రిబ్బన్‌ను వాడతారు.

పసుపు రంగు

యుద్ధ ఖైదీలు, తప్పిపోయిన వారి కోసం ఏర్పాటు చేసిన సమా వేశాల్లో పసుపురంగు రిబ్బన్ ను ధరిస్తారు. ఆత్మహత్యల నివారణకు, ఎముకల క్యాన్సర్ తదితర వాటి గురించి నిర్వహించే అవగాహన సదస్సులో వీటిని ఉపయోగిస్తారు.

గులాబీ రంగు

గులాబీ రంగు రిబ్బన్ మహిళల ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను సూచిస్తుంది. ముఖ్యంగా ఆడవారిలో రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు దీనిని అంతర్జాతీయ గుర్తుగా ఉపయోగిస్తారు.



కొండగట్టులో హనుమాన్ చిన్న జయంతి ఏర్పాట్లు

మల్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగే హనుమాన్ చిన్న జయంతి కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. భక్తుల మాల విరమణ కోసం కల్యాణకట్ట వద్ద బారికేడ్లు, వాటి పై నుంచి భక్తులు కంపార్టుమెంట్లలోకి దూకకుండా పోలీసుల సూచనలతో ఈసారి కొత్తగా జాలీలు ఏర్పాటు చేస్తున్నారు. చలువ పందిళ్ల ఏర్పాటు పనులు కొనసాగుతుండగా దిగువ కొండగట్టు, దొంగలమర్రి వద్ద దేవస్థానం తరఫున స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. బారికేడ్లు, ఇతర ఏర్పాట్లను ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, మల్యాల సీఐ నీలం రవి, అధికారులతో కలిసి పరిశీలించారు. కేవలం దర్శనాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పోలీస్ అవుట్‌పోస్టు నుంచి కోనేరు వరకు ఈసారి ప్రత్యేక దారి ఏర్పాటు చేయనున్నారు.



మాల విరమణ ప్రదేశంలో బారికేడ్లు కడుతున్న సిబ్బంది

రేపు ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

హనుమాన్ చిన్న జయంతి ఏర్పాట్లపై శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించి తగు సూచనలు చేయనున్నారు.

త్వరలో రిజర్వాయర్లలో పూడికతీత పనులు



కొత్తపల్లిలో మోయతుమ్మెద వాగు వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ పెద్ది రమేష్, అధికారులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్ణయం ప్రకారం త్వరలో దిగువ మానేరు జలాశయం, మిడ్ మానేరు జలాశయం, కడెం ప్రాజెక్టులకు సంబంధించి పూడికతీత పనులను ప్రారంభించనున్నట్లు ఇరిగేషన్‌శాఖ, సర్కిల్-2, ఎస్ఈ పెద్ది రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గల మోయ తుమ్మెద వాగును, కొత్తపల్లి శివారులోని ఎస్ఆర్ఎస్పీ భూములను రెవెన్యూ, ఇతర ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ నిర్వాహకులతో కలిసి ఎస్ఈ రమేష్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఎండీ, ఎంఎంఆర్, కడెం రిజర్వాయర్‌లలో పూడికతీతకు సంబంధించి అగ్రిమెంట్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. సుమారు 1453కోట్ల వ్యయంతో 20సంవత్సరాలకు సంబంధించి బాంబెకు చెందిన ఈథర్ ట్రినిటీ సహారా కన్సార్టియం కంపెనీ టెండర్లలో ఈ పనులను దక్కించుకుందని తెలిపారు. నెల వరకు పూడికతీత పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. పనులు ప్రారంభించే ముందు రిజర్వాయర్ నుంచి తీసిన ఇసుకను ఎక్కడ డంప్‌చేయాలి, కంపెనీ నిర్వాహకులకు సంబంధించి కార్యాలయం ఏర్పాటు, వేబ్రిడ్జ్ ఏర్పాటు, పనులు చేసే సిబ్బంది, లేబర్ ఉండేందుకు, మిషనరీల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. ఎస్సారెస్పీ స్థలాన్ని కూడా గుర్తించామని తెలిపారు. రిజర్వాయర్‌లలో పూడికతీత వల్ల నీటి నిల్వ 3.9 టీఎంసీ సామర్థ్యం పెరుగుతుందన్నారు. అదే విధంగా పూడికతీత వల్ల వచ్చే ఇసుకను సంబంధిత కాంట్రాక్టర్ ప్రభుత్వానికి టన్నుకు 406.64 రూపాయలు చెల్లించి ఓపెన్ మార్కెట్‌లో అమ్ముకునే అవకాశం ఉంటుందని అన్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం చేకురుతుందన్నారు. గతంలో రిజర్వాయర్‌ల కోసం డబ్బులు చెల్లించి పనులు చేయించేవారు కానీ ప్రస్తుతం రెండు ప్రయోజనాలు వస్తుండటంతో ప్రభుత్వం ముందు ఈ మూడు రిజర్వాయర్‌లలో పూడికతీతపై పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుందన్నారు. ఇది విజయవంతమైతే మిగతా ప్రాజెక్టులలో కూడా ఇలాంటి ప్రయోగం చేసే అవకాశాలు లేకపోలేదని ఎస్ఈ పెద్ది రమేష్ తెలిపారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఇరిగేషన్‌శాఖ ఈఈ నాగభూషణ్ రావు, ఏజెన్సీ పర్సన్ సతీష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి రథోత్సవం..



రథంపై స్వామివారి ఊరేగింపు

వేములవాడ కల్చరల్ ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని రాములవారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవమూర్తులను హంసవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రావణ్ కుమార్ తదితరులున్నారు.

రాజన్న సేవలో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అధికారుల బృందం

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామివారిని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అధికారులు బుధవారం దర్శించుకున్నారు. గ్రామీణ స్వచ్ఛ భారత్ మిషన్ పరిశీలనలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చిన బృందం సభ్యులు రాజన్నను దర్శించుకొని, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అధికారుల బృందానికి ఆశీర్వచనం ఇవ్వగా, సూపరింటెండెంట్ వరి నర్సయ్య, నరేందర్‌లు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



కోడెమొక్కు చెల్లించుకుంటున్న అధికారుల బృందం

జాతీయ సీనియర్స్ ఖో-ఖో జట్లకు కోచ్‌లుగా ఉమ్మడి జిల్లా వాసులు



పండుగ ఆనంద్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్ ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సాలోని పూరీలో నిర్వహిస్తున్న 57వ సీనియర్స్ జాతీయ ఖో-ఖో పోటీలకు ఉమ్మడి జిల్లావాసులు కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర పురుషుల జట్టుకు ఇల్లంతకుంటకు చెందిన రైల్వే క్రీడాకారుడు పూర్వ భారత జట్టు కెప్టెన్ పండుగ ఆనంద్, భారత పురుషుల రైల్వే జట్టుకు ధర్మారం మండలం బంజరుపల్లి తండాకు చెందిన దక్షిణ మధ్య రైల్వే క్రీడాకారుడు ఇస్లావత్ నరేష్ కోచ్‌గా వ్యవహరిస్తున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్, నరేష్‌ను రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జంగా రాఘవరెడ్డి, నాతి కృష్ణమూర్తి, జిల్లా ఖో-ఖో సంఘం ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు, సంఘం బాధ్యులు అభినందించారు.



ఇస్లావత్ నరేష్

ఎన్టీపీసీ నిర్మాణాలపై కార్పొరేషన్ కొరడా



- నోటీసులకు స్పందించని ఎన్టీపీసీ యాజమాన్యం
- రూ.99 కోట్ల అపరాధ రుసుం విధించిన కార్పొరేషన్

కోల్‌సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ అక్రమ నిర్మాణాలపై రామగుండం నగరపాలక సంస్థ కొరడా ఝుళిపించింది. కార్పొరేషన్ అనుమతులు లేకుండా ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో నిర్మాణాలు జరిపి కార్పొరేషన్ నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు రూ.99,28,29,548 అపరాధ రుసుం విధించినట్లు కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో గత ఏడాది భారీ నిర్మాణాలు చేపట్టింది. మొత్తం 12రకాల నిర్మాణాలను చేపట్టారు. సీ టైపు, బీ టైపుల్లో అపార్ట్‌మెంట్ టవర్లు, సీఐఎస్ఎఫ్‌కు సంబంధించిన బిల్డింగ్‌లు, హెచ్‌ఓడీ బిల్డింగ్, డీ టైపు బిల్డింగ్‌లు, వీఐపీ గెస్ట్ హౌస్, బ్యాచ్‌లర్ హాస్టల్, ఏసీ రెస్టారెంట్, కమ్యూనిటీ సెంటర్ తదితర భవనాలను నిర్మించింది.

ఈ భవనాలకు కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. దీంతో ఏప్రిల్ 22, 2024న 'ఆంధ్రజ్యోతి'లో 'రామగుండంలో అనుమతి లేకుండానే భారీ కట్టడాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. భవన నిర్మాణాలు పూర్తవుతున్నా అనుమతులు తీసుకోకపోవడంతో రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్, జిల్లా యంత్రాంగం సీరియస్‌గా స్పందించారు. ఎన్టీపీసీ యాజమాన్యం చట్ట ప్రకారం మెదలాలని, వెంటనే అనుమతులు తీసుకోవాలని సూచించారు. దీంతో మొత్తం 12 నిర్మాణాలకు సీ టైపు భవనాలు, సీఐఎస్ఎఫ్ భవనాలు తదితర నిర్మాణాలకు రూ.2.4కోట్లు ఫీజు చెల్లించింది. కొన్ని నిర్మాణాలకు మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు ఇచ్చింది. మిగతా నిర్మాణాలు రెసిడెన్షియల్ జోన్‌లో లేకపోవడంతో చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) తీసుకోవాలంటూ నోటీసులు ఇచ్చింది. దీంతో ఎన్టీపీసీ యాజమాన్యం నిర్మాణ స్థలాలకు సంబంధించి సీఎల్‌యూకు ఫైల్ పెట్టింది. డీ టైపునకు సంబంధించి 8.33ఎకరాలు, హెచ్‌ఓడీ భవనాలకు సంబంధించి 7.98 ఎకరాలు, వీఐపీ గెస్ట్‌హౌస్ 2.07ఎకరాలు, బీ టైపు క్వార్టర్లు 3.21 ఎకరాలకు సీఎల్‌యూకు దరఖాస్తు చేసింది. గత ఏడాది సీఎల్‌యూకు దరఖాస్తు చేయగా డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ కార్యాలయం షార్ట్ ఫాల్ ఇచ్చింది. ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు, టోన్సు మ్యాప్‌లు సమర్పించాలని పేర్కొన్నది. మార్చి 19న రామగుండం నగర కమిషనర్ ఆరు నిర్మాణాలకు సంబంధించి అనుమతి లేని భవనాలకు నోటీసులు జారీ చేశారు. దీనిపై స్పందించక పోవడంతో పది రోజుల కాల వ్యవధిపై మార్చి 29న పెనాల్టీ నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

ఆరు భవనాలకు పెనాల్టీ

రామగుండం నగరపాలక సంస్థ ఎన్టీపీసీకి చెందిన అనుమతి లేని ఆరు నిర్మాణంలో ఉన్న భవనాలకు రూ.99.28 కోట్ల పెనాల్టీ నోటీసులు జారీ చేసింది. మున్సిపల్ చట్టం 2019 ప్రకారం అనుమతి లేని కట్టడాలకు నోటీసులకు కూడా స్పందించకపోతే భవనాలకు సంబంధించి స్థలం, భవనాల విలువను పరిగణలోకి తీసుకుని అపరాధ రుసుము విధిస్తారు. బీ టైపు భవనాలకు రూ.39.61లక్షలు, హెచ్‌ఓడీ బిల్డింగ్‌కు రూ.18.55కోట్లు, టైపు డీ భవనాలకు రూ.27.29కోట్లు, గెస్ట్ హౌస్ బిల్డింగ్‌కు రూ.6.61కోట్లు, ఏసీ రెస్టారెంట్ బిల్డింగ్‌కు రూ.2.35కోట్లు, కమ్యూనిటీ సెంటర్ బిల్డింగ్‌కు రూ.4.83కోట్లు పెనాల్టీ జారీ చేసింది.





ఎన్టీపీసీలో నిర్మిస్తున్న భవనాలు

రేవంత్‌రెడ్డికి రైతన్న, నేతన్న రెండు కళ్లు..

అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందికట్ల స్వామి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక రైతన్న, నేతన్నను రెండు కండ్లుగా చూసుకుంటున్నారని అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందికట్ల స్వామి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం వస్త్ర వ్యాపార సంఘం భవనంలో విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు రూ.25వేల కోట్లతో రైతన్నకు రుణమాఫీ, రైతు బంధును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. నేతన్నల రుణమాఫీ రూ.33 కోట్లతో ఐదు వేల మందికి లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని ముఖ్యమంత్రిని కోరగా, వెంటనే రుణమాఫీ చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా రూ.380 కోట్లు బతుకమ్మ చీరల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ద్వారా బకాయిలను విడుదల చేశారన్నారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమకు విద్యుత్ సంక్షోభాన్ని తీసుకొచ్చి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. సెస్‌లో గత ప్రభుత్వానికి చెందిన పాలకవర్గం ఉండడం వల్ల ఒత్తిడి తెస్తున్నారన్నారు. బతకమ్మ చీరల స్థానంలో ప్రభుత్వం రూ.680కోట్ల ఆర్డర్లతో కోటి 30 లక్షల చీరలను ఎనిమిది కోట్ల మీటర్ల ఆర్డర్లను తీసుకొచ్చిందన్నారు.

ఈ ఆర్డర్లు సకాలంలో జరగాలంటే విద్యుత్ సదుపాయం ఉండాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల పనులు జరగకుండా సెస్ పాలకవర్గం ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. విద్యుత్ బకాయిల పేరుతో మీటర్ వైర్లను కట్ చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సెస్ పాలకవర్గం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు భరోసా ఇవ్వడానికే తాము వచ్చామన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, మురళి, వస్త్ర వ్యాపార సంఘం తాటి పాముల దామోదర్, ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి గౌడరాజు, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కార్యదర్శ ఆంకారపు రవి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందికట్ల స్వామి

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

శ్రీధర్‌రెడ్డి, బుగ్గారం ఎస్సై



ఆంధ్రజ్యోతి: మండలంలో నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. వీటితో నేరాలు నియంత్రణలోకి వస్తాయి. నేరస్తులను కూడా పసిగట్టవచ్చు. ఇటీవల దోపిడీ కేసును సీసీ కెమెరాల సహాయంతోనే ఛేదించాం. గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: గంజాయి నియంత్రణకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశాం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారిపై నిఘా పెంచాము. మత్తు పదార్థాలకు యువత ఆకర్షితులు కాకుండా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరలపై ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

ఎస్సై: సైబర్ నేరాల బారిన పడకుండా గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. బాధితులు ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందిస్తున్నాం.

-బుగ్గారం

డీఈవోకు సన్మానం

జగిత్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవ తరగతి పరీక్షలను విజయవంతంగా నిర్వహించినందుకు గానూ జిల్లా విద్యాధికారి రామును బుధవారం పలువురు పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయినిపల్లి ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, నాయకులు కనవేని మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారికి సన్మానం

జగిత్యాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్‌రావును పలువురు అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బోనగిరి నరేశ్, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

నేడు సన్న బియ్యం పంపిణీ

కొడిమ్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభిస్తారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి తెలిపారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

రాయికల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు ఉత్కంసాయి గౌడ్, కోశాధికారి బొంగోని భూమాగౌడ్, రాయికల్ పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు ఎనుగందుల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్ మహేష్ గౌడ్, విఠల్ గౌడ్, వెంకటి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మైతాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు బత్తిని మహేష్ గౌడ్, అల్లకొండ రాజేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఇటిక్యాల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మరిపెల్లి లక్ష్మణ్ గౌడ్, మండల సంఘం అధ్యక్షుడు ఉత్కం సాయ గౌడ్ పాల్గొన్నారు.

● **మల్లాపూర్:** మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో సర్వాయి పాపన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

● **కథలాపూర్:** మండల కేంద్రంలో గౌడ సంఘ నేతలు సర్వాయి పాపన్న విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వాయి పాపన్న సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, జిల్లా కార్యదర్శి అల్లకొండ లింగంగౌడ్, బొంగు నడ్పి సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస అధ్యక్షుడు అజీం, ఉత్కం శ్రీనివాస్, బైరగుడి దేవయ్య తదితరులు ఉన్నారు.





ఇటిక్యాల, కథలాపూర్‌లో సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఈజీఎస్ కూలీలకు రోజు వేతనం రూ.400 చెల్లించాలి

-మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కూలీలకు రోజువారి వేతనం రూ.400కు పెంచాలని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పని దినాలు 100 రోజుల నుంచి 150 పని దినాలకు పెంచాలన్నారు. వ్యవసాయ కూలీల సమస్య ప్రభుత్వ దృష్టికి తీసుకవెళ్లడం బాధ్యతగా బావించి సీఎం రేవంత్ రెడ్డికి లేఖను పంపుతున్నానని వెల్లడించారు. ఈ సమావేశంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ గుంటి జగదీశ్వర్, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల సేవలను వినియోగించుకోవాలి'

రాయికల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అంగన్‌వాడీల సేవలను వినియోగించుకోవాలని సీడీపీవో మమత అన్నారు. రాయికల్ పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ప్రీస్కూల్ నమోదు శాతం పెంచాలని, పిల్లల ఎదుగుదల ప్రతి నెల పర్యవేక్షిస్తూ, తల్లులకు గృహ సందర్శన ద్వారా సలహాలు, సూచనలు అందించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి అందించే సేవలు ప్రతి కుటుంబం అందుకోవాలని, ఎండాకాలం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నందున పిల్లలు బయటకు వెళ్లకుండా చూడాలని తల్లులకు తెలుపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, రాయికల్ సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ధర్మపురి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి బార్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించారు. ధర్మపురి జూనియర్ సివిల్‌జడ్జి శ్యామ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధ్యక్షులుగా అలుక వినోద్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బందెల రమేష్, ప్రధాన కార్యదర్శిగా మామిడాల శ్రీకాంత్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా గూడ జితేందర్‌రెడ్డి, కోశాధికారిగా జాజాల రమేష్, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శిగా బత్తిని ఇంద్రకరణ్ ఎన్నికయ్యారు. గ్రంథాలయ కార్యదర్శిగా సుంకె రాజు, సీనియర్ కార్యవర్గ సభ్యులుగా గడ్డం సత్యనారాయణరెడ్డి, అప్పాల నిరంజన్, కార్యవర్గ సభ్యులుగా కస్తూరి శరత్‌కుమార్, ఓరుగంటి చంద్రశేఖర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాలకు చెందిన సీనియర్ న్యాయవాదులు బెత్తపు లక్ష్మణ్, మారిశెట్టి ప్రతాప్, కొండపల్కల వెంకటేశ్వర్‌రావు, ఎర్ర నర్సయ్య, దుమ్మెన శ్రీనివాస్, రౌతు రాజేష్, ఏజీపీ ఇమ్మడి శ్రీనివాస్, గంగాధర్, గంగరాజం, కార్తీక్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాయంలో దరఖాస్తు దారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం గతంలో ఏప్రిల్ 5లోపు దరఖాస్తులకు గడువును ప్రకటించిందన్నారు. అట్టి గడువును ఈనెల 14వరకు పొడిగించిందన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకానికి వయస్సు 21 నుంచి 55 సంవత్సరాల లోపు అర్హులైన మండలంలోని నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ, ఈబీసీ యువత దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకోనే వారు తమకు సంబంధించిన ఆధార్, రేషన్, పాన్ కార్డులతో పాటు క్యాస్ట్, ఇన్‌కామ్, బ్యాంకు వివరాలు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో మీ సేవలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో దరఖాస్తులు చేసుకున్న వారు ఈనెల 14 లోపు సంబంధిత పత్రాలన్నింటినీ ఎంపీడీవో కార్యాలయంలోని సిబ్బందికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, దరఖాస్తు దారులు, తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగు, అయిలాపూర్, మోహన్‌రావుపేట గ్రామాలలో సన్న బియ్యం పంపిణీని స్థానిక నాయకులతో కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు కృష్ణారెడ్డి, పడాల లచ్చులు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అంజిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సాయిరెడ్డి పాల్గొన్నారు.

● **మెట్‌పల్లిటౌన్:** సన్న బియ్యం పంపిణీ పథకంను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం చరిత్రత్మకంగా నిలిచిపోతుందని మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. రేగుంట 13వ వార్డులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 12వ వార్డులో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ షాకీర్ సిద్దికి రేషన్ షాపులలో ప్రారంభించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి తహసీల్దార్ ఆర్. శ్రీనివాస్, ఎడ్మాల లక్ష్మరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ కొమ్ముల సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

● **ఇబ్రహీంపట్నం:** సన్న బియ్యం పంపిణీ పథకంను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం చరిత్రత్మకంగా నిలిచిపోతుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణరావు అన్నారు. బుధవారం ఆయన ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ బొరిగం రాజు పాల్గొన్నారు.

● **మెట్‌పల్లి రూరల్:** మండలంలోని మేడిపల్లి, వేంపేట గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు సన్న బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రేషన్‌షాపు నిర్వాహకులు పాల్గొన్నారు.

● **కథలాపూర్:** అంబారిపేటలో తహసీల్దార్ వినోద్‌తో కలిసి కాంగ్రెస్ శ్రేణులు వినియోగదారులకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీం ఉన్నారు.

● **మల్లాపూర్:** ప్రభుత్వం అందజేస్తున్న సన్న బియ్యం పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. చిట్టాపూర్ గ్రామంలోని రేషన్ షాపులో లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మల్లాపూర్, వాల్గొండ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి, మాజీ సర్పంచ్ జమాల్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన దాసరి లచ్చయ్య గౌడ్ (54) ప్రమాద వశాత్తు చెట్టుమీద నుంచి పడి మృతి చెందగా వారి కుటుంబాన్ని తక్కళ్ల గ్రామంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ పరామర్శించారు. కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అంద జేశారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్‌గౌడ్, సాయ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల సైబర్ క్రైం ఎస్‌ఐ ఎన్.కృష్ణ అన్నారు. బుధవారం సైబర్ జాగ్రత్త దివస్ ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గీతా విద్యాలయంలో పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన వల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణ మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టింగ్, ఐపీఎల్ టికెట్ల మోసాల గురించి వివరించారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌ను ప్రోత్సహించే విదంగా ప్రకటనలు ఉంటాయని వాటిని చూసి మోసపోవద్దని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు వివరించారు.

నేడు దొడ్డి కొంరయ్య జయంతి

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పోరాట యోదుడు దొడ్డి కొంరయ్య గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గుండేటి సునీత ఒక ప్రకటనలో పెర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే దొడ్డి కొంరయ్య జయంతి కార్యక్రమానికి జిల్లాలోని పప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, బిసి,ఎస్సీ ఎస్టీ, కుల సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని ఆమె పెర్కొన్నారు.

'ప్రభుత్వ భూముల వేలాన్ని ఉపసంహరించుకోవాలి'



మాట్లాడుతున్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి

కథలాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాల ప్రభుత్వ భూములను వేలం వేయాలనే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని భూషణరావుపేటలో విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. భూముల వేలంను విద్యార్థులు ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు రుచి చూపించారని ఆరోపించారు. కోర్టుకు సెలవు దినం చూసి విద్యార్థులను అరెస్ట్ చేయడాన్ని తప్పుబట్టారు. అటవీ, వృక్ష సంపదను నాశనం చేయడంతో పాటు భవిష్యత్ తరాలకు భూములు లేకుండా చేయడం దారుణమని అన్నారు.

విద్యార్థులు కాంగ్రెస్ సర్కారుకు రాబోవు రోజుల్లో గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తీట్ల శంకర్, బద్దం మహేందర్, పురుకుటపు గంగారెడ్డి, ముస్కు శ్రీనివాస్, కారంగుల రాజరెడ్డి తదితరులు ఉన్నారు.

'కుమ్మరి సంఘం బలోపేతానికి కృషి'

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 2. (ఆంధ్రజ్యోతి): కుమ్మరి సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి పెల్లి కృష్ణ అన్నారు. కుంభార సశక్తి కరణ్ కార్యక్రమంలో భాగంగా గ్రామోద్యోగ్ వికాస్ యోజన పథకంలో ఆధునిక యంత్రంపై కుండలు తయారీలో శిక్షణ పొందిన 20 మంది లబ్ధిదారులకు ఖాదీ, గ్రామీణ పరిశ్రమ కమీషన్ ఆధ్వర్యంలో మంజూరైన యంత్రాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఉన్న కుమ్మరి సంఘం భవనంలో మాస్టర్ ట్రైనర్ ఉప్పులూటి వినయ్, జిల్లా అధ్యక్షుడు కృష్ణ చేతుల మీదుగా ఆధునిక యంత్రాలను పంపిణీ చేయడంతో పాటు శిక్షణ పొందిన సర్టిఫికేట్లను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలాపురం తిరుపతి, ఉపాధ్యక్షుడు రాదారపు దేవదాసు, రాజకీయ విభాగం అధ్యక్షుడు కల్లేటి రమేష్, వృత్తి విభాగం జిల్లా అధ్యక్షుడు మామిడిపెల్లి మహిపాల్, కోశాధికారి సిరికొండ రాజన్న, మెట్‌పెల్లి, ధర్మపురి డివిజన్ అధ్యక్షులు మర్రిపెల్లి శంకర్, రాదారపు రాజేశం, నాయకులు సిరికొండ శ్రీనివాస్, మొండయ్య, రమేష్, నరేష్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆటిజం బాధితులకు ఉత్తమ సేవలు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆటిజం గల పిల్లలకు సముచితమైన సేవలు అందించేందుకు జగిత్యాల వైద్య కళాశాల కట్టుబడి ఉందని జగిత్యాల ప్రధానాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్ అన్నారు. బుధవారం జగిత్యాల వైద్య కళాశాలలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆటిజం ఉన్న పిల్లలను తదుపరి దశలో గుర్తించడం సరైన చికిత్స అందించడం ఎంత కీలకమో వివరించారు. ఈ విషయమై నర్సింగ్ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటిజం అక్షణాలు, నిర్ధారణ, మరియు చికిత్స ప్రత్యేక విద్యా విధానాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

గొల్లపల్లి, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్గుమట్ల-బొంకూర్ గ్రామాల సరిహద్దులో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాలు అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. వధువు తరఫున వెన్గుమట్ల గ్రామస్థులు వరుడు తరఫున బొంకూర్ గ్రామస్థులు స్వామివారి ఉత్సవ మూర్తితో డప్పుచప్పుళ్ల నడుమ ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాంగోపాల్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు నక్క శంకరయ్య, సురిగినేని కమలాకర్ రావు, కందుకూరి సత్తయ్య, గుడ్ల లక్ష్మీరాజేశం, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

పెగడపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బతికెపల్లి గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ. 20 లక్షలతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి శంఖుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిఖిల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎలగొండ కృష్ణహరి, కారోబార్ మదూకర్, నాయకులు శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వెల్గటూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం రాజక్కపల్లి గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు పనులను ప్రత్యేకాధికారి, తహశీల్దార్ శేఖర్ ప్రారంభించారు. పోచమ్మ గుడి వద్ద సుమారు రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

బీర్‌పూర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో లచ్చాలు అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, ఇరిగేషన్, ఐసీడీఎస్, ఇంజనీరింగ్, ఈజీఎస్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలను రూపకల్పన చేసుకోవాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఈనెల 14 వరకు గడువు పొడిగించిందని తెలిపారు. ఆన్‌లైన్ చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ ఫారంను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌కు అప్పగించాలన్నారు. దరఖాస్తుదారులు రన్నింగ్‌లో ఉన్నా బ్యాంక్ ఖాతా నెంబర్ మాత్రమే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ అన్నారు. బుధవారం పేదలకు సన్న బియ్యంను ఉచితంగా పంపిణీ చేస్తున్నందుకు గాను రేషన్ షాపు వద్ద బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చిత్రపటాలకు బీజేపీ నాయకులు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కరోన కష్ట కాలం నుండి ఇప్పటి వరకు పేదలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. ఇప్పటి నుండి సన్నబియ్యం పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు సన్నబియ్యం తినాలనే సంకల్పంతో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరిబాబు, బీజేపీ నాయకులు దొపికెల నవీన్, గుంటుక సదాశివం, వెంకటరెడ్డి, కృష్ణమాచారి, శ్రీకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్‌కాంప్లెక్స్ గదులకు వేలం

మల్యాల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మల్యాల గ్రామ పంచాయితీ కార్యాలయం షాపింగ్ కాంప్లెక్స్‌లోని గదుల లీజుకు ఏడాది కాలపరిమితికి గాను ఈ నెల 4న వేలం నిర్వహించనున్నట్లు ఈవో శ్రీకాంత్ తెలిపారు. వీటితో పాటు తైబజార్, వాటర్‌ప్లాంట్స్‌కు టెండర్లు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆసక్తి గల వారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎస్సెస్సీ పరీక్షలు

వెల్గటూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కుమ్మరిపల్లి మాడల్ స్కూల్, చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. కుమ్మరిపల్లి మాడల్ స్కూల్‌లో 254 మంది విద్యార్థులకు గాను 254 మంది, చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 63 మంది విద్యార్థులకు గాను 63 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ తెలిపారు. కాగా మాడల్ స్కూల్‌లో చీఫ్ సూపరిండెంట్‌గా ముత్తునూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి, డీవోగా రాజేశ్వర్‌లు, చెగ్యాం ఉన్నత పాఠశాలలో సీఈఎస్‌గా వెల్గటూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నందయ్య, డీవోగా రాజమణి వ్యవహరించారు. పరీక్షలు ముగియడంతో బాల బాలికలు ఆనందంగా ఇళ్లకు బయలుదేరారు.



విజయ సంకేతం చూపుతున్న పదో తరగతి విద్యార్థులు

● **కొడిమ్యాల, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని 3 పదవ తరగతి పరీక్షా కేంద్రాలలో బుధవారం పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. 393 మంది విద్యార్థులు 100శాతం విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఓకేషనల్ పరీక్ష ఉన్నట్లు ఎంఈవో తెలిపారు.

'కొత్త రేషన్‌కార్డులపై ప్రధాని ఫొటో ముద్రించాలి'

ధర్మపురి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోటో ముద్రించాలని బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్మపురి పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా జారీ చేసే రేషన్ కార్డులపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫోటో ముద్రించక పోవడం విచారకరమని ఆయన అన్నారు. భారత ఆహార సంస్థ పది వేల కోట్లు సబ్సీడీ ఇచ్చి ఉచితంగా కేంద్రం బియ్యం పంపిణీ చేస్తే ప్రభుత్వం గొప్ప అని చెప్పుకోవడం సిగ్గుచేటని ఆయన తెలిపారు. సొమ్ము ఒకరిది, సోకు ఒకరిది అన్నట్లు ఉందని ఆయన విమర్శించారు. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కార్యక్రమం కింద తెలంగాణలోని 3.50 కోట్ల లబ్దిదారులకు నెలకు 5 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తుందని ఆయన అన్నారు. కేవలం ఒక కిలో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తూ చెప్పుకోవడం సిగ్గు చేటని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ ధర్మపురి అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, పట్టణ మాజీ అధ్యక్షులు బెజ్జారపు లవణ్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, దివిటి శ్రీధర్ పాల్గొన్నారు.

స్వామి వారి అనుగ్రహంతో ప్రజలు సంతోషంగా ఉండాలి

మల్లాపూర్, ఏప్రిల్, 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిట్టాపూర్, రాఘవపేట గ్రామాల్లోని స్వామి వారి అనుగ్రహంతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయాల్లోని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసదాలను స్వీకరించారు. ఆలయంకు వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. రాఘవపేటలోని మల్లికార్జున ఆలయంలో నవగ్రహ ప్రతిష్టపనలలో భాగంగా శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో విగ్రహాలను ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఉత్సవ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి దర్శించుకున్ని ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగింపు

కోరుట్ల, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30 వరకు ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపు గడువును ఈ నెల 30వ తేదీ వరకు పెంచినట్లు మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్ బుధవారం తెలిపారు. క్రమబద్ధీకరణ చేసుకొనుటకు 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● **రాయికల్:** ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్ గడువు మార్చి 31తో ముగియనుండగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడగించినట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం తగ్గింపు చేసిందని, ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కుగానీ, కాల్ సెంటర్ 9493471494ను సంప్రదించాలని కోరారు.

కుంట మత్తడి పరిశీలన

కథలాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీర్‌పూర్ కచ్చరాని (కొచ్చెరువు) కుంట రూ.30 లక్షలతో మరమ్మతులు చేపట్టగా బుధవారం ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి పరిశీలించారు. ఇటీవల తెగిన కట్టను కాంట్రాక్టర్లు పూర్తి చేయగా మత్తడి పనులు చేపట్టాల్సి ఉంది. భారీ వర్షాలకు ఇటీవల మత్తడి తెగిపోయింది. మత్తడి నిర్మాణంకు రు. 25 లక్షలు పోను మిగిలిన రు. 5 లక్షలతో మత్తడి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా డీఈఈ ప్రశాంత్, ఏఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇంటి పన్ను చెల్లింపులో రాయితీ

రాయికల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి 30లోపు ఇంటి పన్ను చెల్లించిన వారికి 5శాతం రాయితీ కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

పెగడపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని లింగాపూర్ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడుగా మధూకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఉపాధ్యక్షులుగా కాశెట్టి బాలరాజును ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు.